ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 23.09.2024 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1 అమృత్ పథకం టెండర్లలో అక్రమాలు జరిగాయని బీఆర్ఎస్ పార్టీ తమ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తోందని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు.

2. రాష్ట్రంలోని వైద్య ఆరోగ్య సేవల విషయాన్ని అధ్యయనం చేసేందుకు బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన నిజనిర్ధారణ కమిటీ సభ్యులను అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం వాస్తవాలను దాస్తున్నదని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు ఆరోపించారు.

3. పలు సాగునీటి ప్రాజెక్టుల్లో నీళ్లు ఉండి కూడా ప్రభుత్వం పంటకు సాగుకు నీరు అందించడం లేదని బీఆర్ఎస్ నేత మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు.

4. రాష్ట్రంలో మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని 11 జిల్లాలకు వాతావరణ కేంద్రం పసుపు హెచ్చరిక జారీ చేసింది.

అమృత్ పథకం- కేటీఆర్ -మల్లు రవి

అమృత్ పథకం టెండర్లలో అక్రమాలు జరిగాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దగ్గరి బంధువులకు నేల కోట్ల రూపాయల కాంట్రాక్టులు కట్టబెట్టారంటూ మాజీ మంత్రి , బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు తమ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. తారక రామారావు అరోపిస్తున్నట్టు సూదిని సృజన్ రెడ్డి ముఖ్యమంత్రికి సొంత బావ మరిది కాదన్నారు. ఈ విషయంలో తారక రామారావు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. సృజన్ రెడ్డి ఆన్ లైన్ లో టెండర్లు వేసి అమృత్ పథకంలో కాంట్రాక్టు పొందారని, ఇందులో అక్రమాలకు తావు లేదన్నారు. కేంద్రం ప్రభుత్వ ఆధ్వర్యంలోని అమృత్ పథకం టెండర్లలో ముఖ్యమంత్రికి సంబంధం ఉండదన్న ఆలోచన కూడా లేకుండా బీఆర్ఎస్ పార్టీ నేతలు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

(పీఎన్)

కేటీఆర్-నిజ నిర్ధారణ కమిటీ

రాష్ట్రంలోని వైద్య ఆరోగ్య సేవల విషయాన్ని అధ్యయనం చేసి, నివేదిక ఇచ్చేందుకు బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన ముగ్గురు డాక్టర్లతో కూడిన నిజనిర్ధారణ కమిటీ సభ్యులను పోలీసులు అడ్డుకోవడంపై ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారక రామారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య పరిస్థితి అధ్యయనం చేయడానికి నిపుణులైన డాక్టర్లతో

త్రిసభ్య కమిటీ వేశామన్నారు. హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి కమిటీని వెళ్లకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. వాస్తవాలను ప్రభుత్వం ఎందుకు దాస్తున్నదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంత ప్రయత్నించినా వాస్తవాలను దాచలేరరని వాస్తవ పరిస్థితిని బయటకు తీసుకొచ్చే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదంటూ సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు. కాగా, బీఆర్ఎస్ నియమించిన కమిటీ అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్యను పోలీసులు ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో అడ్డగించారు. మరో ఇద్దరు సభ్యులైన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, , మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, జుబ్లిహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తో కలిసి గాంధీ ఆసుపత్రిలోకి వెళ్లే ప్రయత్నం చేశారు. (డెస్క్)

హరీశ్ రావు-పంటలు

రాష్ట్రంలో సాగునీటి పలు ప్రాజెక్ట్ లలో నీళ్లు ఉండి కూడా ప్రభుత్వం పంటకు సాగుకు నీరు అందించడం లేదని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. రాష్ట్రంలో నీళ్లు లేక పంటలు ఎండుతున్నాయని, దీనికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనేనని ఆరోపించారు. ఈ రోజు హైదరాబాద్ తెలంగాణ భవన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నిండుకుండలా ఉన్నా నల్లగొండ జిల్లాలో రైతులకు పూర్తిగా సాగునీరు అందకపోవడం దారుణమన్నారు. ఖమ్మం జిల్లాలో ముగ్గరు మంత్రులు ఉన్నా ఆ జిల్లాలో నీళ్లు లేక పంటలు

ఎండుతున్నాయని విమర్శించారు. సాగర్ కాలువ కు గండి పడి 22 రోజులు గడిచినా.. ఇప్పటి వరకు ఎందుకు పూడ్చలేదని ప్రశ్నించారు. గతేడాది ప్రకృతి కరువు తీసుకొస్తే .. ఈ ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం కరువును తీసుకొచ్చిందని విమర్శించారు.

((HYD-PTC)

సిద్దిపేట-పొన్నం ప్రభాకర్

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ రోజు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. కోహెడ మండలం శనిగరం చెరువును పరిశీలించిన మంత్రి చెరువులో గంగమ్మకి పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న సమస్యలను ప్రజలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. గుట్ట నుండి వరద నీరు గ్రామంలోకి చేరుకుందని గ్రామస్థులు చెప్పడంతో గుట్ట నుండి వచ్చే నీటిని ఫ్రోక్లెయిన్ ద్వారా పంపించాలని అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. అనంతరం అక్కడి బీసీ వసతి గ్రుహాన్ని సందర్శించిన మంత్రి విద్యార్థులకు అందుతున్న ఆహారం, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. (పీఎన్)

భద్రాద్రి-పొంగులేటి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు నియోజకవర్గంలో సుమారు 22 కోట్ల రూపాలయ విలువైన పలు అభివృద్ధి పనులకు తెలంగాణ రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపనలు చేశారు.

ఇల్లందు- ముకుందాపురం, ఇల్లందు-మేడికుంట బీటీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసి ఇల్లెందు చెరువు కట్ట లేక్ వ్యూ పార్క్ సుందరీకరణ, మున్సిపల్ మోడల్ మార్కెట్ కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.

(భద్రాద్రి కొత్తగూడెం)

వాతావరణం

రాష్ట్రంలో మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు 11 జిల్లాలకు పసుపు హెచ్చరిక జారీ చేసింది. హైదరాబాద్‌తో సహా పలు జిల్లాల్లో ఈ నెల 25 వరకు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇదిలా ఉండగా, హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో నిన్న సాయంత్రం 58 మిల్లీమీటర్ల వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. నైరుతి రుతుపవనాల కారణంగా రాష్ట్రంలో గణనీయమైన వర్షపాతం నమోదైంది. రాష్ట్రం మొత్తంలో ఇప్పటివరకు సగటున 919 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం 703.6 మిల్లిమీటర్ల కంటే ఇది 31 శాతం అధికం.

హైడ్రా-మాదాపూర్

హైదరాబాద్ లో హైడ్రా అక్రమ నిర్మాణాల కూల్చివేతలను కొనసాగిస్తోంది. ఈ ఉదయం మాదాపూర్ లోని అక్రమ నిర్మాణాలను కుల్చివేశారు. కావురి హిల్స్

పార్క్ స్థలంలో అక్రమ నిర్మాణాలను గుర్తించిన హైడ్రా అధికారులు.. పోలీసుల బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. కావూరి హిల్స్ పార్కు స్థలంలో అక్రమంగా స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేశారని హైడ్రాకు ఫిర్యాదు అందింది. దీంతో అక్రమ షెడ్లను అధికారులు కూల్చివేశారు. పార్కు స్థలాన్ని 25 ఏళ్ల లీజుకు తీసుకున్నామని స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులు చెప్పారు. గడువు తీరకముందే అన్యాయంగా నిర్మాణాలు తొలగించారని ఆరోపించారు.

(HYD-PTC)

సీఎం సహాయ నిధి-మహేశ్ బాబు

రాష్ట్రంలో ఇటీవల సంభవించిన వరదల్లో నష్టం సంభవించిన నేపథ్యంలో పలువురు ప్రముఖులు విరాళాలు అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయనిధికి సినీ నటుడు మహేష్ బాబు దంపతులు 60 లక్షల రూపాయాల విరాళం అందజేశారు. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన మహేశ్ బాబు వ్యక్తిగతంగా 50 లక్షల రూపాయాల చెక్, తమకు చెందిన AMB సంస్థ తరపున మరో 10 లక్షలు రూపాయల విరాళం చెక్ కూడా అందజేశారు. (డెస్క్)

నిర్మల్ షెడ్యూల్డ్ బైట్-పోషణ అభియాన్

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ అభియాన్ పథకానికి నిర్మల్ జిల్లా పెంబి మండలంలో గర్భిణులకు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామని

మంచి పోషకాహారం తీసుకోవాలని అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి రాజేందర్ ఆకాశవాణితో చెప్పారు.

(సౌండ్ బైట్ జిల్లా వైద్యాధికారి రాజేందర్) (పిటిసి నిర్మల్ జిల్లా)

సిరిసిల్ల విద్యుత్ చార్జీలు-సీఎం

రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు అదనంగా విధించిన విద్యుత్ చార్జీల ను రద్దు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సీపీఎం, సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్య క్షుడు ఎస్.వీరయ్య, కార్యదర్శి వర్గ సభ్యుడు జూకంటి రంగారెడ్డి సచివాలయంలో ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. పది హెచ్ పీ ల పైన ఉన్న వాటిని నాలుగో కేటగిరీ కింద పరిశీలించి సబ్సిడీ అందించాలని, యారన్ సబ్సిడీ విడుదల చేయాలని పేర్కొ న్నారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలం గా స్పందించినట్లు నాయకులు చెప్పారు. (పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)

పోషణ మాసంపై ప్రత్యేక దృష్టి

ఆసిఫాబాద్ జిల్లాలో పోషణ మాసం పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ అడేపు భాస్కర్ అన్నారు. జిల్లాలో అన్ని అంగన్వాడీలలో ఈ నెల 1 నుండి 30 వరకు పోషణ మాసం నిర్వహిస్తున్నట్లు ఆకాశవాణికి తెలిపారు.

(సౌండ్ బైట్ డాక్టర్ అడేపు భాస్కర్)

(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)

సిరిసిల్ల-సీపీఎం

సీపీఎం రాజన్న సిరిసిల్ల జిల్లా మహాసభలు నవంబరులో జరుగుతాయని, ఇందుకోసం వార్డుల వారీగా సమావేశాలను నిర్వహిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ తెలిపారు. సిరిసిల్ల పట్టణంలో మరమగ్గాల కార్మికులకు ఉపాధి లేక గత తొమ్మిది నెలలుగా కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు.

(పీటీసీ, సిరిసిల్ల)

సింగరేణి-నిరసన

సింగరేణి కార్మికులకు వాస్తవ లాభాలతో బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘం TBGKS పిలుపు మేరకు ఈ రోజు మంచిర్యాల జిల్లాలోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియా లోని సింగరేణి గనుల వద్ద కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. సింగరేణి సంస్థకు వచ్చిన వాస్తవ లాభాలలో కార్మికులకు బోనస్ ఇవ్వకుండా నికర లాభాల్లో 33 శాతం ఇవ్వడాన్ని TBGKS నాయకులు తప్పు పట్టారు. కార్మికుల కష్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటుందని, పండుగ వేళ ప్రభుత్వం కార్మికుల పొట్ట కొడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. (పీటీసీ, మంచిర్యాల)

మంచిర్యాల-తనిఖీలు

నిషేధిత మావోయిస్టు పార్టీ అక్టోబర్ 20 వరకు ఆ పార్టీ అవతరణ వార్షికోత్సవాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో మంచిర్యాల జిల్లాలోని తెలంగాణ-

మహారాష్ట్ర సరిహద్దు ప్రాణహిత, గోదావరి నది తీర ప్రాంతాల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు.. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో తనిఖీల తో పాటు అటవీ ప్రాంతాల్లో పోలీసులు అదనపు బలగాలతో కూంబింగ్ నిర్వహిస్తున్నారు. .అనుమానితులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని మంచిర్యాల జిల్లా నిల్వాయి ఎస్సై శ్యాం పటేల్ సూచించారు.

-పిటిసి, మంచిర్యాల జిల్లా

మంచిర్యాల జిల్లా- స్వచ్ఛతహీ సేవా

పరిసరాలు వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని మంచిర్యాల జిల్లా నస్పూర్ మున్సిపాలిటీ కమిషనర్ సతీష్ అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఈ ఉదయం మంచిర్యాల జిల్లా సీతారాంపల్లి గ్రామ సమీపంలో ఉన్న గోదావరి నది వద్ద మున్సిపల్ చైర్మన్ వేణు తో కలిసి చెత్తను తొలగించారు. స్వచ్ఛత కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కమిషనర్ సతీష్ పిలుపునిచ్చారు. (పీటీసీ, మంచిర్యాల)

సంగారెడ్డి-ఓడీఎఫ్ అప్రెంటిస్

సంగారెడ్డి జిల్లాలోని భారత అయుధ కర్మగారం (ODF) AVNL విభాగం వివిధ ట్రేడ్ లలో అప్రెంటిస్ కోసం 335 మందిని తీసుకోనున్నట్లు ఓడిఎఫ్ చీఫ్ మేనేజర్ మోహన్ కృష్ణ తెలిపారు. అప్రెంటిస్సిప్ మేళాను సంగారెడ్డి ఐటిఐలో ఎల్లుండి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు అప్రెంటిస్షిప్ మేళాక హాజరుకావాలని సూచించారు.

(SANGAREDDY PTC)

వనపర్తి- పిడుగు పాటు

వనపర్తి జిల్లాలో పిడుగు పాటుకు గుర్తై ఓ మహిళ మృతి చెందింది. వనపర్తి రూరల్ ఎస్ ఐ జలంధర్ రెడ్డి తెలిపిన వివరాలమేరకు వనపర్తి మండలం చిమనగుంట పల్లి కి చెందిన 35 ఏళ్ల గొల్ల పద్మ గొర్రెల కాపరిగా వెళ్లి నిన్న పిడుగుపాటుకు గుర్తై మృతి చెందినట్టు తెలిపారు. భర్త యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. (పిటిసి, వనపర్తి)